# పౌష్టికాహారం అందిస్తూ, పాఠాలు బోధించాలి

## అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆకస్మిక తనిఖీ:కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/ వేములవాడ:** అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు.అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో తరగతులను పరిశీలించారు. స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోవడంతో పరిశీలించి, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 26 జూన్, 2025 | పేజీలు :08


# పర్యావరణం దెబ్బతీస్తున్నా.. పట్టించుకునేవారు లేరు

## మైనింగ్, రెవెన్యూ అధికారుల ప్రేక్షకపాత్ర...



**ప్రజాపక్షం/నందిపేట్ :**నందిపేట్ మండల కేంద్రం పలుగుగుట్ట సమీపంలో కొందరు ఇష్టారీతిగా రాత్రి వేళలో మొరం తవ్వి అమ్ముకుంటు చెట్లు నరికి పర్యావరణం దెబ్బతీస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడం విచారకరం. ఈ విషయంలో గ్రామాభివృద్ధి కమిటి సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలువనున్నారు. ఈ గుట్టకు ఏపుగా చెట్లు పెరిగాయి. కొన్ని వన్య ప్రాణులు జీవిస్తున్నాయి. కొందరు భూ బకాసురులు, మొరం మాఫియా ఇష్టారీతిగా చెట్లు నరికివేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటున్నా రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ అధికారులు తమకెందుకులే అంటు వ్యవహరించడం ఆశ్చర్యకరం. గుట్టకు పెద్ద పెద్ద గుంతలు తవ్వి మొరం దొంగిలిస్తున్న ఎవరికి తెలియదు. నందిపేట్‌కు కూత వేటు దూరంలో గుట్ట ఉన్న ఏ అధికారి పట్టించుకోకపోవడం బాధాకరం. ఇదే రహదారి వెంట కలెక్టర్, జిల్లా అధికారులు మండల అధికారులు కార్యాలయాలకు వస్తుంటారు. అయినా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదు. ఒకవైపు ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చుతో పచ్చని మొక్కలు నాటి పెంచితే మరోవైపు మొరం మాఫియా చెట్లు నరికి పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ విషయంలో నందిపేట్ గ్రామాభివృద్ధి కమిటి, గ్రామస్తులు స్పందించి ధర్నా, రాస్తారోకో జరిపి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు.

**ఏడితో సర్వే చేయిస్తా.. తహసీల్దార్...**

గుట్టను ఆక్రమించిన భూ బకాసురుల భూములు, మొరం తవ్వకాలపై ఏడి ఆద్వర్యంలో 15 మంది సర్వే బృందంతో కొలతలు చేయించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని నందిపేట్ తహసీల్దార్ సంతోష్ తెలిపారు.

# నిర్మల్‌లో గంజాయి,సైబర్ నేరాలపై ఎస్‌పి జానకి షర్మిల ఉక్కుపాదం..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన,ఆన్‌లైన్ నేరాల నియంత్రణ,రౌడీ షీటర్లపై కఠిన చర్యలపై జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు.బుధవారం రోజున జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె అధికారులకు ఈ మేరకు కీలక దిశానిర్దేశం చేశారు.ఎస్పీ డా.జానకి షర్మిల జిల్లాలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్,నాన్,గ్రేవ్ మిస్సింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు అండగా ఉండాలని,అత్యాచార,పోక్సో కేసులలో త్వరితగతిన నిందితులను న్యాయస్థానం ముందు ఉంచాలని ఆదేశించారు.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో పాటు సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.మాదకద్రవ్యాల నిర్మూలనుకు "మిషన్ గంజా గస్తీ ప్రోగ్రాం" ను పక్కాగా అమలు చేయాలని ఎస్పీ షర్మిల స్పష్టం చేశారు.జిల్లాలో గంజాయి సరఫరా,వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా యువత ఈ వ్యసనాల బారిన పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే వెంటనే 8712659599 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించేందుకు,నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న రౌడీ షీటర్లపై ముందస్తు నిఘా ఉంచి,చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.ఆన్‌లైన్ బెట్టింగ్‌లు,మోసాలు,డ్రగ్ దుర్వినియోగం,ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో,విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని సూచించారు.డిజిటల్ అరెస్ట్ పేరుతో ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని,ఏ పోలీసు అధికారి వీడియో కాల్స్ ద్వారా అరెస్ట్ చేయరని ప్రజలు గుర్తించాలని ఆమె అన్నారు.ఆన్‌లైన్ మోసాలకు గురైతే మొదటిగంటలోపు (https:// www.cybercrime.gov.in)1930కుకాల్ చేయాలని లేదా ..(AM BIS (Automated Multimodal Biometric Identification System)) లో ఫిర్యాదు చేయాలని సూచించారు.దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలకు సంబంధించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలని కోత్తగా వచ్చిన () టెక్నాలజీని వినియోగించి కేసులను చేదించాలిని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి,ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతిరోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి,మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.నకిలీ నంబర్ ప్లేట్లు,నంబర్ ప్లేట్ల మార్పు పై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నా రు.సిసి కెమెరాల ప్రాధన్యతను వివరిస్తూ,అన్ని ముఖ్యమైన ప్రదేశాలలలో వాటిని ఏర్పాటు చేసే విధంగా వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు చే శా రు.ఈసమీక్షాసమావేశంలోఅదనపుఎస్పీఉపేందర్‌రెడ్డి,ఏ.ఎస్పీ, ప లువురు ఇన్‌స్పెక్టర్లు,ఎస్.హెచ్‌ఓలు,పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి న్యూస్

# సంజీవని అంబులెన్స్‌ను ఏర్పాటు చేసిన యాజమాన్యం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 11వ ఇంకెన్ లో పని చేస్తున్న కార్మికుల కు దురదృష్ట వశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు బాధితుల ను ఏరియా హాస్పిటల్ కి తీసుకు వెళ్ళాలంటే గోదావరిఖని కంపెనీ ఆసుపత్రి చాలా దూరంగా ఉన్నందున, వారి సౌకర్యార్థం గని పై సంజీవని అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆర్జీ వన్ యాజమాన్యం కు గత కొన్ని నెలల క్రితం ప్రతి నెలా జరిగే ఏరియా లెవెల్ స్ట్రక్చర్ సమావేశం లో డిమాండ్ పెట్టి చర్చించడం జరిగిందని, ఆర్జీ వన్ యాజమాన్యం అంబులెన్స్ ఏర్పాటు కు అంగీకరించినప్పటికి సంజీవని అంబులెన్స్ కు డ్రైవర్ల కొరత కారణంగా ఏర్పాటు లో ఆలస్యం జరిగింది తప్ప ఇది మా వల్లే సంజీవని అంబులెన్స్ ఏర్పాటు చేశారని, ఇతర యూనియన్ లు ప్రచారం చేయడాన్ని ఏఐటియుసి ఖండిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, పిట్ సెక్రటరీ , సహాయ కార్యదర్శి లుఒక ప్రకటన లో పేర్కొన్నారు. అదే విధంగా సంజీవని అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్‌కు రు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.



## నగునూర్‌లో ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**ఆషాఢమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా అమావాస్యను పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అమ్మవారికి ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం శాకంబరీ ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ద్వజారోహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ కర్మఫలాపేక్ష లేకుండా త్రికరణ శుద్దిగా కర్మలను ఆచరించాలన్నారు. సకల చరాచర సృష్టిలో దైవాన్ని దర్శిస్తూ అందరి హితాన్ని కోరుతూ జీవించడమే మనం భగవంతుడికి సమర్పించే ఆత్మనివేదన అవుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడి బియ్యం, చీరెసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## "నేటి నుండి వారాహీదేవి" నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** సకల చరాచర సృష్టిని పాలించే సృష్టి స్థితి లయకారిని శ్రీ చక్రవాసిని, శ్రీ లలితమాత సైన్యాధిపతి వారాహీ దేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం బ్రౌన్ప్రారంభమవుతాయని 108 శ్రీ చక్ర సహిత శ్రీ లలితామాత దేవాలయ ఫౌండరీ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు.జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలో కొలువై ఉన్న లలితమాత ఆలయంలో నేటి నుండి జూలై 5 వరకు వారహీదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని స్వరూప అన్నారు.


## రైతు భరోసా సంబరాలు



**ప్రజా పక్షం /మల్యాల :** రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.రైతు భరోసా పూర్తయిన సందర్భంగా బుదవారం మల్యాల మండల కేంద్రం స్థానిక అంగడి బజార్ లో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి,మంత్రుల ,స్థానిక ఎమ్మెల్యే మేడి పెల్లి సత్యం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా చెల్లించడం గొప్ప విషయమని అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపిపి ఆది రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వెల్మ లక్ష్మి రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద రెడ్డి,నియోజక వర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్,మండల యువజన అధ్యక్షుడు తిరుపతి,అంజిరెడ్డి,చారి,నక్క అనిల్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూమి సాగును అడ్డుకుంటున్న వారిపై చర్యలు

### జిల్లా కలెక్టర్‌కు దళిత రైతు గంగయ్య వినతి



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ భూ పంపిణీ కార్యక్రమం ద్వారా ఇచ్చిన భూమిని సాగుచేసుకోకుండా అడ్డుపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడమే కాకుండా భూ భారతిలో నాకు పట్టా పాస్ బుక్ ఇవ్వాలని కోరుతూ జగిత్యాల రూరల్ మండలం గూట్రాజ్ పల్లె కు చెందిన కళ్లెపెల్లి గంగయ్య అనే దళిత రైతు బుధవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారు. గంగయ్య తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలం గూట్రాజ్ పల్లెలో 439/12 సర్వే నంబర్ లో భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ భూ పంపిణీ కార్యక్రమంలో ఇవ్వగా అప్పటి నుండి భూమిని తహసీల్దార్ సూచించిన మ్యాప్ ప్రకారం కొన్నేళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబం జీవనం సాగిస్తున్నాము. ఇట్టి భూమిలో భావి తవ్వుకుని కరెంట్ మోటార్ పెట్టుకుని సాగు చేస్తూ కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నానని, అయితే ఇట్టి భూమికి జగిత్యాల రెవెన్యూ అధికారులు లొకేషన్, మ్యాప్ కూడ ఇచ్చారని వివరించారు. మా గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు నాపై కక్ష గట్టి మా సోదరులకు ఇందులో పాలు ఉన్నదని రెచ్చగొడుతూ అభూమిని సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టి భూమిపై ఆధారపడి మా కుటుంబం జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సాగును అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గంగయ్య కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు అట్టి భూమికి నాకు పూర్తి అధికారాలు కట్టబెట్టేలా పట్టాధారు పాస్ బుక్ అందించేలా చర్యలు తీసుకోవాలని గంగయ్య కలెక్టర్ ను కోరారు.

# దివ్యాంగులకు అంజన్న దర్శన భాగ్యం దక్కేనా..?



**ప్రజాపక్షం/మల్యాల:**జగిత్యాల జిల్లా మల్యాల మండ లం ముత్యం పేట గ్రామం ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన కొం డ గట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలు మూలల నుండి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు.ఇందులో చంటి పిల్లలు, వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారు ఉంటారు .ముఖ్యంగా దివ్యాంగుల కొరకు కొండగట్టు దేవస్థానం లో ఏ విధమైన ప్రత్యేక ఏర్పాట్లు,సదుపాయాలు లేవు. కనీసం ర్యాంపు సౌకర్యాలు కూడా లేక దివ్యంగా భక్తు లు అంజన్న దర్శనం వ్యయ ప్రయాసంగా మారి వారు దర్శనం చేసుకోకుండానే తిరుగు ప్రయా ణం అవుతున్నారు.ఇక మంగళ ,శని వారాల్లో అయితే కొండగట్టు లో వృద్దుల కు, దివ్యంగులకు అంజన్న దర్శనం చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇఒ కార్యాలయం ముందు పోలీస్ చెక్ పోస్ట్ నుండి వీల్ చైర్ ద్వారా,రామాలయం ముందున్న గేట్ దాటి ఆలయ ప్రధాన ద్వారం ద్వారా అంజన్ననుదర్శనంచేసుకోవాలి.కానీసెక్యూరిటీ సిబ్బ ంది వికలాంగులకుచక్రాల కుర్చీ ఇచ్చి ,రామాల యం ముందున్న గేట్ తీయకుండా, నడవడానికి వీలులే నిపైపుల ద్వారా వెళ్ళమని,వారి పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు,ఉదాసీనంగా వ్యవరిస్తున్నారు.గేట్ పైపులలో వీల్ చైర్ పట్టలేని పరిస్థితిలో చేసేది ఏమీ లేక దివ్యాంగులు గేటు దాటుకుంటు చాలా ఇబ్బంది పడుతుంటారు.మంగళ,శని వారాల్లో 100 రూపాయల శీఘ్ర దర్శనం టిక్కెట్ తీసుకొనికి వెళ్లిన వృద్దులకు క్యూ లైన్ లోపల గేట్ ఎక్కి వెళ్ళాల్సిందే అని సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారని,మాకు వెళ్లే పరిస్థితి లేదు అని మొరపెట్టుకున్న మాకు ఇఒ ఆర్డర్ అని చెప్పడం తో చేసేదేమి లేక దర్శనం చేసుకోకుండానే వెళుతున్నారు. కొండగట్టు దేవస్థాన ఇఒఆర్డర్ పట్ల,సెక్యూరిటీ సిబ్బంది,ఆలయ సిబ్బంది, తీరు పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కనీసం మానవత దృక్పథం నైనా గేట్ తీయమని బ్రతిమిలాడినా మా పట్ల దురుసుగా ప్రవర్తించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ,దేవాలయాల్లో వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసి వారి కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేయించాల్సి ఉంది.కనీసం ఇప్పటికైనా చంటి పిల్లలకు, వయో వృద్ధులకు,దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారికి, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉచిత దర్శనం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

# రైతుల పేరిట ఫ్లెక్సీ ఏర్పాటు



**ప్రజాపక్షం/మల్లాపూర్:** రైతులకు రెండు లక్షల రూ పాయల వరకు 100శాతం రుణ మాఫీ చేశామని రాష్ట్ర ప్ర భుత్వం ప్రకటించడం రైతాంగాన్ని మోసం చేయడమేనని మొగిలిపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకు లు, రైతులు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం సు మారు 276 మంది రైతులకు అసలు రుణమాఫీ కాలేదని ప్రభుత్వం 100శాతం రుణమాఫీ చేశామని చెప్పుకోవడంలో నిజం లేదని, సియం సారు మేమేం చేశాం పాపం... మాకేది రుణమాఫీ అంటూ పేర్లతో సహా ఫ్లె క్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు ముందు ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ లేని వారు వెంటనే బ్యాంకులకు వెళ్లి తెచ్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని ప్రకటించగానే రైతులు బ్యాంకుల చు ట్టు పరుగులు పెట్టి రుణాలు తెచ్చుకున్నారని, తీరా సమయానికి కొద్దిమందికి రుణమాఫీలు చేసి, చాలా వరకు రైతులను రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రైతులు ఆరోపించారు. తక్షణమే మొగిలిపేటకు చెందిన 276 మంది రైతులకు రుణమాఫీ చేయాలని, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జెల్ల ప్రసాద్ యాదవ్, మాజీ సర్పంచ్ , రైతులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ బాధుతులకు సన్మానం

**ప్రజాపక్షం/ధర్మపురి :**ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తి కాగా అందులో ఇబ్బందులకు గురైన వారిని గుర్తించి బిజెపి నాయకులు శాలువాతో సన్మానించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో బుధవారం బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎమర్జెన్సీ సమయంలో పలువురిని అరెస్టులతో ఇబ్బందులకు గురి చేసిన ఘటనలో బాధితులైన లక్ష్మి నర్సయ్య అనే వ్యక్తిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో సుమారు 21 నెలలు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. అదే విదంగా 50 ఏండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దమనకాండను నిరసిస్తూ రాజ్యాంగ ఆసన దినం సంవిధాన్ హత్యా దివాస్‌గా బిజెపి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కార్యక్రమ కో కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఓగేటి అంజన్న, ప్రధాన కార్యదర్శి వినోద్, స్థంభంకాడి శ్యాం, రవి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

## మా భూమిని మాకు ఇప్పించండి

**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్:**వారసత్వంగా రావలసిన మా భూమిని ఎక్కువగా పట్టా చేయించుకున్న వారి నుండి మాభూమిని మాకు ఇప్పించాలని పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన నెత్తెట్ల ఓదెలు, సదయ్య, శ్రీనివాస్, రజిత అధికారులను వేడుకున్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 369/2/1 లో మాకు ఉండాల్సిన భూమి కంటే తక్కువగా ఉందని వాపోయారు. ఆభూమిని మా బంధువులు అయిన నెత్తెట్ల సదయ్య, బాపు పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. మా భూమిని తిరిగి మాకు పట్టా చేయమంటే నెత్తెట్ల సదయ్య, బాపు, రాజ్ కుమార్ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మా భూములకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా మాకు న్యాయం జరగడం లేదని, రెవెన్యూ, పోలీసు అధికారులు జోక్యం చేసుకుని మా భూ సమస్య పరిష్కరించాలని కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు ఒరిగిందేమీ లేదు

### డిహెచ్‌పిఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా దళితులకు ఎస్సీ కార్పోరేషన్ నిధులు ఎవరికీ అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బోయిని అశోక్ అన్నారు. కరీంనగర్ జిల్లా ముఖ్యుల సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దళిత సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇండస్ట్రియల్ లోన్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్, చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల కోసం పోరాటాలకు సిద్దం కావాలన్నారు. దళిత హక్కుల పోరాట సమితి గ్రామ, మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసుకుని సభ్యత్వాలు చేర్పించే కార్యక్రమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు పార్నంది రాజకుమార్, బోయిని పటేల్, మహిళ నాయకురాలు శారద, ఎస్.నాంపల్లి, అందె సంపత్, అందె వెంకట్, ఎ.పుల్లయ్య, రాజు, సంపత్ తదితరులున్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థికి పుస్తకాలు అందజేత



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**తండ్రి లేని చిన్నారికి ఓ ప్రభుత్వ ఉద్యోగి పాఠ్యపుస్తకాలు అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీధర్ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. ఆసిఫ్‌నగర్ సరస్వతి విద్యావిహార్ హైస్కూల్‌లో చదివిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తూడి సురేషన్ అనే ప్రభుత్వ ఉద్యోగి తన తల్లిదండ్రులు మరియమ్మ సుదర్శన్ జ్ఞాపకార్ధం మరిణించిన శ్రీధర్ కుమారులు సాద్విక్‌కు రూ.6వేల విలువైన పుస్తకాలు కొనుగోలు చేసి అందజేశారు. సంపాదనలో తోచింది సహాయం చేయాలని ఆయన కోరారు. సహజ ఫౌండేషన్ అధ్యక్షుడు, ప్యాక్స్ డైరెక్టర్ బెజ్జంకి కళ్యాణ్, పాఠశాల కరెస్పాండెంట్ గాజుల తిరుపతిలున్నారు.

# గొర్రెలతో గాంధీ భవన్‌కు వెళ్లడంలో దురుద్దేశం లేదు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :ఈనెల 23న హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ కు గొర్రెలతో వెళ్ళడంలో ఎలాంటి దురుద్దేశం లేదని యాదవ సంఘం నాయకులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని యాదవ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్ అధ్యక్షతన బుధవారం జరిగిన పత్రికా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు యాదవ్ మాట్లాడారు. గత 20 నెలలుగా గొర్రెలు, మేకలు, పశువులకు సంబంధించిన మందులను వాటి బాగోగులను పశుసంవర్ధక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర ప్రభుత్వంలో యాదవుల పాత్ర లేకుండానే ప్రభుత్వము నడుస్తున్నదని ఆవేదనతో నిరసన మాత్రమే తెలిపినట్లు చెప్పారు. యాదవుల పాత్ర లేకుండా ప్రభుత్వాలు నడవలేదని, కానీ రెండుసార్లు మంత్రివర్గ విస్తరణ జరిగినా కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులలో ఒక్కటి కూడా అందించలేదని పార్టీ పదవుల్లో కూడా యాదవుల ప్రాతినిధ్యం లేకుండా ఉన్నదని అవమానంగా, అగౌరవంగా భావించి మా ఆవేదనను ప్రభుత్వానికి, కన్నతల్లి అయిన కాంగ్రెస్ పార్టీకి తెలియజేయాలనే ఉద్దేశంతో గొర్రెలను గాంధీభవన్ కు తోలుకొని వెళ్లినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పదవులలో పెద్దపల్లి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాలని, పశు సంవర్ధక శాఖకే ఒక మోడల్ జిల్లాగా పేరొందిన పెద్దపల్లి జిల్లాను పరిగణలోకి తీసుకొని ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులకు పదవులను అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ పదవిని పెద్దపల్లి జిల్లాకు కల్పించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుపై ఉన్నదని అభిప్రాయపడ్డారు. నూతనంగా మంత్రి బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ బాధ్యత తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ తరపున విజ్ఞప్తి చేశారు. ఇతర పార్టీలు అయిన బిఆర్ఎస్, బిజెపి యాదవులకు పార్టీ పదవులలో, నామినేటెడ్ పదవులలో మా దామాషా ప్రకారం పదవులను ఇవ్వని పక్షంలో బిజెపి, బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యాలయాలను పెద్ద ఎత్తున గొర్రెలు, మేకలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జికెఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెల్పుల నాగరాజ్ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు దాడి చంద్రమౌళి యాదవ్, దొంగతుర్తి మాజీ ఎంపిటిసిదాడి సదయ్య యాదవ్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెత్తుల నాగరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి బాధితుడికి అందజేత

ప్రజాపక్షం/గంగాధర:గంగాధర మండలం మంగపేట గ్రామానికి చెందిన అనిల్ కుమార్ అనే వ్యక్తి మొబైల్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి మొబైల్ ఫోన్‌ను తిరిగి రికవరీ చేసి బాధితునికి అప్పగించారు. ఈ సందర్భంగా గంగాధర ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ మొబైల్ పోగొట్టుకున్నట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్‌లో పూర్తి వివరాలు పొందుపరచాలని , తద్వారా వారి మొబైల్స్‌ను రికవరీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలుసిఇఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘంలో పలువురి చేరిక

ప్రజాపక్షం/శంకరపట్నం:మండల కేంద్రంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం మండల అధ్యక్షుడు అంతడుపుల సతీష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు దేవుని కిష్టయ్యతో పాటు 50 మంది సభ్యులు తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘంలో చేరారు. వారిని శాలువాలతో ఆహ్వానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బొజ్జ రవి, మైసాని మనోహర్, నియోజకవర్గం అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి ఓదెలు, సీనియర్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ నిర్బంధానికి 50 ఏళ్లు

### చీకటి రోజుకు వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో నిరసన



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:పెద్దపల్లి అమరవీరుల స్థూపం వద్ద పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఎమర్జెన్సీ నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డుపెల్లి రవి మాట్లాడుతూ ఇందిరా ప్రభుత్వం 1975 జూన్ 25 రోజు అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించి 21నెలల కాలం ఎమర్జెన్సీని కొనసాగించడంతో భారతదేశంలోని ప్రజలకు పౌర ప్రజాస్వామిక హక్కులను హరించి భారతదేశ వేలాదిమంది ప్రజలను బందీలుగా చేసి హక్కులను కాలరాసి అనేక చిత్రహింసలకు గురిచేసిందని ,నాటి నుండి నేటి వరకు క్రూరమైన చట్టాలను తీసుకువచ్చారని,ఎమర్జెన్సీ తర్వాత 1985 టాడా చట్టాన్ని 2002లో, పోటా చట్టాన్ని, 2004 నుండి ఊపా చట్టాన్ని తీసుకువచ్చి 2024 వరకు క్రూరమైన చట్టాన్ని అమలుపర్చి ప్రజలు కళాకారులు విద్యార్థులు జర్నలిస్టులు మేధావులను ఉపా చట్టంతో నిర్బంధించి అనేక రకాలుగా వేధిస్తున్నారని అన్నారు. ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ పహార్ ఆపరేషన్ కొనసాగించి 2025 జనవరి 1 నుండి ఆపరేషన్ కగార్ పేరుతో 560 ఎన్కౌంటర్ల పేరిట మావోయిస్టులను హత్య చేయడాన్ని నిరసిస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరుణా జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు నారా వినోద్,సహాయ కార్యదర్శి ,తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య

### ఘటనకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్టునేతల డిమాండ్

### ఘటనకు మంత్రి సీతక్క బాధ్యత వహించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాడనే నెపంతో ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డి పై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్లావర్జుల వంశీ విద్యానంద్, జిల్లా కార్యదర్శి నారాయణ దాసు అశోక్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బాధ్యత వహించాలని, ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టులు కావాలని తప్పుడు వార్తలు రాస్తే లీగల్ గా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వారిని భయభ్రాంతులకు గురి చేసే విధంగా భౌతిక దాడులకు దిగడాన్ని సహించేది లేదని పేర్కొన్నారు. అన్నారు. జర్నలిస్టు శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## యువత క్రీడల్లో రాణించాలి

### ముద్రకోల వెంకన్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన చల్మెడ



ప్రపక్షం/వేములవాడ టౌన్: యువత క్రీడల్లో రాణించాలని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీ నరసింహారావు అన్నారు. బుధవారం పట్టణానికి చెందిన 17వార్డు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకన్న ఆధ్వర్యంలో ఐబీపీ గ్యాస్ గోదాం మైదానంలో ఏర్పాటుచేసిన ముద్రకోల వెంకన్న ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ను చల్మెడ లక్ష్మీ నరసింహారావు టాస్ వేసి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులతో మాట్లాడి టోర్నమెంట్ ను విజయవంతం చేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల్లో రాణించి వారి ప్రతిభ చాటుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించి ఇలాంటి టోర్నమెంట్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశం ను ఆయన అభినందించారు. అనంతరం చల్మెడ గారికి నిర్వాహకులు, క్రీడాకారులు శాలువతో సత్కరించి సన్మానించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్లో 17వ వార్డు నుండి నాలుగు జట్లు పాల్గొంటున్నాయని శుక్రవారం ఫైనల్ జరుగునున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేష్, నాయకులు ,టోర్నమెంట్ నిర్వాహకులుతదితరులు ఉన్నారు.

## సూపరింటెండెంట్ నియామకాల్లో అవకతవకలు అన్న వార్తలు అవాస్తవం

### జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు

ప్రజా పక్షం/పెద్దపల్లి రూరల్ : బాలసదనం సూపరింటెండెంట్ నియామకాల్లో అవకతవకలు అనే ప్రచారంలో ఉన్న వార్తలు అవాస్తవమని జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అనాథ బాలికల ఆశ్రమం కల్పించడానికి 2021 సంవత్సరంలో ప్రభుత్వం బాలసదనం మంజూరు చేసిందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల సదనం ప్రారంభించి, జిల్లాలోని అనాథ బాలలు, పాక్షిక అనాథ బాలల వివరాలను సేకరించి వారిలో అవసరం ఉన్న 48 మంది బాలలను బాల సదనంలో చేర్పించామని అన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సూపరింటెండెంట్ తో సహా అన్ని ఉద్యోగాలు అవుట్సోర్సింగ్ లో మాత్రమే మంజూరు అయ్యాయని, 48 మంది పిల్లల ఆలనా పాలన చూసుకోవడానికి 24 గంటల ఉద్యోగుల పర్యవేక్షణ అవసరం ఉందని, ఇందు కోసం ప్రస్తుతం జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను రీఎంగేజ్ చేసుకున్నామని, ఎలాంటి కొత్త నియామకాలు జరగలేదని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి సమ్మయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందంలు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆయన కుమారులు రాచపల్లి అంబేద్కర్, రాచపల్లి జగ్జీవన్‌లను మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అంబాల రాజు, జమ్మికుంట మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాచపల్లి రమేష్, నగరం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సంపత్ తదితరులున్నారు.

## 'శ్రీకృష్ణవేణి'లో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, నష్టాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, యువత ఆరోగ్యమైన జీవన విధానంతో ఉన్నత చదువులతో సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణపై పెయింటింగ్ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్ఐ నరేష్ రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చొప్పదండి ఎస్ఐ నరేష్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సృజన్ కుమార్, అనిల్, ఖలీఫా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్నిచల్మెడ పరామర్శ

ప్రజాపక్షం/ వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్రె రాజవ్వమైనయ్యలకు చెందిన ఇల్లు సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాన్ని గురికాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పరామర్శించారు. ముందుగా ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలించి రాజవ్వ కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు ఇల్లు దగ్గం కావడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట మండల అధ్యక్షుడు గోస్కుల రవి, సీనియర్ నాయకులు ఏస తిరుపతి, గడ్డం హన్మండ్లు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షులు తీగల శ్రీనివాస్, పసుల అంజి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, గ్రామస్తులు స్థానికులు ఉన్నారు.

# శ్రీ హనుమాన్ సాయి రైస్‌మిల్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

### 780 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసిన అధికారులు

**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ టీం హైదరాబాద్ జగిత్యాలలో ఆకస్మిక దాడులు నిర్వహించి 780 క్వింటాళ్ల బియ్యం పట్టుకోవడం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జిల్లా సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రహస్య సమాచారం మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోనీ శ్రీ హనుమాన్ సాయి రైస్ మిల్ పై మంగళవారం రోజున విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ టీం హైదరాబాద్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు జరుపగా అక్రమంగా నిలువచేసిన ప్రజా పంపిణీ సన్నబియ్యం సుమారు 780 క్వింటాళ్ల బియ్యం పట్టుకోవడం జరిగింది. ఇట్టి దాడులలో భాగంగా ఆటోను సీజ్ చేశామని, రైస్ మిల్ యజమానిపై ఏ ఎ6 కేసు నమోదు చేయడం జరిగిందని అలాగే పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ మెట్పపల్లి గోదాం నందు బద్ధపరచడం జరిగిందని జగిత్యాల జిల్లా సివిల్ సప్లై అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా



పౌరసరపర అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి వ్యయ ప్రయాసాలకు ఓర్చుకొని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని పిడిఎస్ బియ్యం అక్రమ వ్యాపారం చేయవద్దని అనేక సందర్భాలలో ద్వారా తెలియజేస్తున్నప్పటికీ కొందరు అదేపనిగా పిడిఎస్ సన్న బియ్యం వ్యాపారం చేసినట్లయితే సన్న బియ్యం నమ్మిన వారు మరియు కొనుగోలు చేసిన వారి యొక్క రేషన్ కార్డును రద్దు పరచడం జరుగుతుందని ఆదేశించారు. ఇట్టి దాడులలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ టీం హైదరాబాద్, జిల్లా పరవాసాలు ఒక అధికారి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ అధికారి, జగిత్యాల సివిల్ సప్లై ఇతర అధికారులు ఇతరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీల నిర్వహణ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మాదక ద్రవ్యాలా దుర్వినియోగం అక్రమ రవాణా అవగాహన వారోత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ,మల్లన్న పేట , చిల్వకోడూర్ గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలుగు దృశ ప్రభావాల గురించి డ్రాయింగ్ , స్లోగన్ ,రైటింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఎస్సై చిర్ర సతీష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల గురించి వాటి వల్ల జరిగే నష్టం గురించి విద్యార్థి దశ నుండి మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కలిగి ఉంటే వాటి జోలికి వెళ్లకుండా వారితో పాటు వారి చుట్టుప్రక్కల వున్నవారికి కూడా అవగాహన కలిపిస్తారు తద్వారా ప్రతీ ఒక్కరికి అవగాహన ఏర్పడుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎస్సై చిర్ర సతీష్ ,ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి , జెడ్ పి హెచ్ ఎస్ మల్లన్న పేట ,చిల్వకోడూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు , పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ వేణు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

## బెల్టు షాపులను మూసి వేయాలని కార్యదర్శికి గ్రామస్తుల వినతి



**ప్రజాపక్షం/బాన్సువాడ :**బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామంలో మద్యం బెల్టుషాపులను మూసివేయించాలని కోరుతు గ్రామస్తులు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి భరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బెల్టు సాపుల వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడడమే కాకుండా గొడవలు జరిగే ఆస్కారం ఉందని, మద్యానికి బానిసై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యువత మద్యానికి బానిస కాకుండా ఉండాలంటే గ్రామంలో మద్యం విక్రయాలను నిలిపివేయాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. బెల్టు సాపుల మూసివేతకు సంబంధిత ఉన్నతాధికారులకు సైతం వినతి పత్రాలు అందించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

### మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఏ రకంగానైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని బదనం చేయాలని చూస్తున్నారని పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని శవాల పైన రాజకీయాలు చేయడం మానుకోవాలని మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం గొల్లపల్లి మండలం బిబి రాజు పల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య అతని మామిడి తోటలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. శంకరయ్య ఆత్మహత్య చేసుకుని చనిపోతే వారి కుటుంబాన్ని ఆదుకొని చెయుతనియ్యాల్సిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడం సరయిన పద్ధతి కాదు. బిబి రాజు పల్లి మాజి సర్పంచ్ అతను గడిచిన 10 సంవత్సరాలలో సర్పంచ్ గా కొనసాగలేదు అంతకంటే ముందుగానే అంటే పది సంవత్సరాల కంటే ముందు అతను తన యొక్క గ్రామానికి సర్పంచిగా సేవలు చేయడం జరిగింది. అతను ఏదైతే గ్రామానికి సంబంధించిన పనులు చేశాడో ఆ పనులు కాంగ్రెస్ పార్టీ 2023 వ సంవత్సరంలో అధికారంలో రావడానికి అంటే ముందే అతనికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 2023 అసెంబ్లీ ఎలక్షన్ ని దృష్టిలో ఉంచుకొని ఫేక్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగింది. గడిచిన 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని ఆగం చేసింది. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ లోటు చేసి చిన్న బిన్నం చెంసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీపై మాట్లాడే నైతిక హక్కు లేదు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసి సభ్యులు దాసరి తిరుపతి గౌడ్, పట్టణఅధ్యక్షులు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

### 29వ తేదీన కోడెల పంపిణీ కార్యక్రమం

### ఆలయ ఇన్‌చార్జి ఇఒ రాధాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి

**ప్రజా పక్షం/ వేములవాడ:** తిప్పాపూర్ లోని గోశాలలో ఈ నెల 29 న వేములవాడ కోడెలను పంపిణీ చేయనున్నట్లు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇన్చార్జి ఇఒరాధాబాయి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 250 కోడెలను ఆదివారం ఉదయం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం అర్హత కలిగిన రైతులు జిల్లా వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ ttps://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కోడెలు పంపిణీ చేసే రోజున రైతులు ఆన్లైన్లో నమోదు చేసిన ఆయా సర్టిఫికెట్లు పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. అర్హులైనరైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చనిస్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

## విశ్వకర్మల అభినందన సభ కరపత్ర ఆవిష్కరణ

**ప్రజాపక్షం/చిగురుమామిడి:**వరంగల్ జిల్లాలో జులై 1న కీర్తి గార్డెన్ భద్రకాళి దేవాలయం ఎదురుగా విశ్వకర్మల అభినందన సభ నిర్వహించడం జరుగుతుందని విశ్వకర్మల రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, విశ్వకర్మల మండల అధ్యక్షుడు శ్రీరామ రాజకుమార్ తెలిపారు. బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలో అభినందన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ వారు మాట్లాడుతూ అభినందన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణలోని విశ్వకర్మ కుటీర పరిశ్రమకు సబ్సిడీ విద్యుత్ 5 హెచ్‌పి నుంచి 25 హెచ్‌పి వరకు సబ్సిడీ సాధించిన సంధర్బంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి, విద్యుత్ అధికారులకు అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మలు భారీ సంఖ్యలో పాల్గొని అభినందన సభను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యక్షులు అనువోజు బాలకృష్ణ ఆచారి, చిగురుమామిడి గ్రామ శాఖ అధ్యక్షుడు పోలో సదాచారి, కార్యదర్శి జనార్ధన చారి, విశ్వకర్మలు ,తదితరులున్నారు.

## ఎస్ఐ గీతకు అభినందనలు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ గీతకు పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కొంద్ర రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ బొడ్డుపెల్లి రాజన్న, ఆకుల జమునరాజిరెడ్డి, మాజీ ఎంపీటిసి,నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సర్ఫేస్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణి అర్జీ వన్ ఏరియా లోని డిపార్ట్మెంట్లలో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ పోస్టులను ఏఐటీయూసీ కృషి ఫలితంగానే బుధవారం ఆర్జీ వన్ యాజమాన్యం సర్ఫేస్ లో భర్తీ చేయడం జరిగిందని ఎఐటియుసి ఆర్జీ వన్ డిపార్ట్మెంట్ ల ఇంచార్జ్ సయ్యద్ సోహేల్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఇట్టి పోస్ట్ లను భర్తీ చేయాలని ఎఐటియుసి పక్షాన ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనులు సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి మెప్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నేడు అట్టి పోస్టులను భర్తీ చేసిన సందర్భంగా అర్జీ వన్‌జిఎం లలిత్ కుమార్‌కు , అలాగే ఎఐటియుసినాయకత్వానికిఆయనఒకప్రకటనలోకృతజ్ఞతలుతెలిపారు.

## కాంట్రాక్టు సూపర్ వైజర్‌పై చర్యలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** గోదావరిఖని ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో పని చేస్తున్న మహిళా సిబ్బంది విధుల్లో ఉన్న సమయంలో కాంట్రాక్టు సూపర్ వైజర్ పోటోలు తీస్తూ వారిని మానసికంగా వేదింపులకు గురిచేస్తూ వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నందున అతనిపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ జిల్లా వైద్యాధికారులను, జిల్లా కలెక్టర్ ను ఒక ప్రకటన లో కోరారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో దాదాపు 200 మంది నర్సులు విధులు నిర్వహిస్తున్నారని, కాంట్రాక్టు సూపర్ వైజర్ విధుల్లో ఉన్న వారి ఫోటోలు తీయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ వైద్యాధికారులు ఇంత జరుగుతున్నా దురాగతాలకు పాల్పడుతున్న సూపర్ వైజర్ పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన మెడికల్ కాలేజీ వైద్యాధికారులను ప్రశ్నించారు.

## వరకట్న వేధింపులు

**ప్రజా పక్షం/మల్యాల:** అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త తో పాటు అత్తింటికి చెందిన కుటుంబ సభ్యుల పై మల్యాల పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.జగిత్యాల జిల్లా మల్యాల ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన కాసర్ల హన్విక అలియాస్ తాడుక సాత్విక కు గొల్ల పెల్లి మండలం బిబిరాజ్ పెల్లి గ్రామానికీ చెందిన కాసర్ల కళ్యాణ్ ను ఏడాది క్రితం వివాహం జరిగింది.పెళ్లిసమయంలో కట్న, కానుకలు, బంగారం ఇచ్చారు. కొన్ని రోజులు వారి కుటుంబం సాపిగా జరిగింది. ఆ తర్వాత హన్సిక అలియాస్ సాత్విక కష్టాలు మొదలయ్యాయి. అదనపు కట్నం తీసు క రావాలని తరచూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించే వారని అదనపు కట్నం తీసుకురాకుంటే చంపేస్తామని బెదిరించే వారని,అత్తింటి వారి వేధింపులు భరించలేక ఆమె తల్లి గారి ఊరైన ముత్యం పేటకు వచ్చి ఉంటుం ది. పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టి సమస్య తీరలేదు. చివరకు ఆమె అత్తింటి వారి పై పోలీసులకు పిర్యాదు చేసింది. హాన్విక అలియాస్ శ్వతికఫిర్యాదు మేరకు భర్త కల్యాణ్,అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభం

**ప్రజాపక్షం / మల్లాపూర్:** 40 సంవత్సరాల పసుపు రైతుల చిరకాల వాంఛను నెరవేర్చి ఈనెల 29న ఇందూరు జిల్లా కేంద్రంలో పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున రైతులు హాజరై విజయవంతం చేయాలని బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన రైతులతో సమావేశమై పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి రైతులు తరలిరావాలని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా విచ్చేస్తున్నారని పాల్గొని విజయవంతం చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వాకిలి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జి శ్రీనివాస్, నాయకులు కాంతాయ చారి తదితరులున్నారు

## ప్లాంటేషన్ పరిశీలన

**ప్రజాపక్షం/సారంగపూర్:**జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రెచపెల్లి గ్రామంలో బృహత్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ప్లాంటేషన సైట్‌ను బుధవారం డిఆర్‌డిఏ పి డి రఘువరన్ సందర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డివో మదన్మోహన్, తహసీల్దార్ , ఎంపిడిఒ చౌడారపు గంగాధర్,ఎపిఒ శ్రీలత, టిఎశివ,పంచాయితీకార్యదర్శి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంజారా సేవ సంఘం మండల కార్యవర్గానికి సన్మానం

### సన్మానించిన ఉమ్మాజి నరేష్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం సిరికొండ మండల కార్యవర్గాన్ని కాంగ్రెస్ యువ నాయకులు ఉమ్మాజీ నరేష్ సన్మానించారు. మండల అధ్యక్షులుగా బాదావత్ రూప్‌సింగ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ రవినాయక్, ఉపాధ్యక్షులు బాల్‌రాజ్‌నాయక్, బద్యనాయక్, కార్యదర్శిగా పీషావత్ రమేష్, సభ్యులుగా గణేష్ నాయక్‌లను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ నరేష్‌ను సన్మానించామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రన్న, సంతోష్‌నాయక్, చందర్‌నాయక్, శివాజీనాయక్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు మృతి బాధాకరం

### ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్డెమ్

ప్రజాపక్షం / ఆర్మూర్ : పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో బుదవారం జక్క రమణయ్య చిత్రపటానికి నవనాథపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్డెమ్ మాట్లాడుతూ రమణయ్య మృతి చాలా బాధాకరమని ఆయన మరణం తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. టియుడబ్ల్యు ఐజెయు ద్వారా వారి కుటుంబానికి లబ్దిచేకూరేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తమ్మే వినోద్, ఉపాధ్యక్షుడు గంధం చిరంజీవి, గౌరవ అధ్యక్షుడు అమృతాల శ్రావణ్, కోశాధికారి లిక్కి శ్రావణ్, సలహాదారులు మహేశ్, షికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ముఖేష్, మాజీ ఉపాధ్యక్షుడు ముద్రకోల వినోద్, జర్నలిస్టులు గణేష్ గౌడ్, నితీష్, సూరిబాబు, గటాడి అరుణ్ కుమార్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలి

### సబ్ కలెక్టర్ వికాస్ మహతో



ప్రజాపక్షం/బోధన్: వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని బోధన్ పట్టణంలోని నివాస ప్రాంతాల్లో నీటి నిల్వ, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ అధికారులు సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని వార్డు నంబర్ పదిలోని డి40/11కాలువ, ధోబోలి గల్లీ నర్సాపూర్ రోడ్ కాలువ, వార్డు నంబర్ 12లోని శాంతినగర్ కాలువలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన వార్డు నంబర్ 10లోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారుడితో మాట్లాడారు. మరింత వేగవంతంగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పై విమర్శలు సహించం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిపై ఏ రకమైన విమర్శలనైనా సహించేది లేదని బీజేపీ సీనియర్ నాయకులు రామ్నాథ్,తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.బుధవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,ప్రజలు 50 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిపించిన ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు నిరాధారమైన విమర్శలు చేయడం ఎంతమాత్రం సరికాదని మండిపడ్డారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ,ప్రజాతీర్పును గౌరవించాలని,కాంగ్రెస్ నాయకులు తమ విమర్శలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.అనవసరమైన ఆరోపణలతో ప్రజలకు తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.భవిష్యత్తులో ఇటువంటి విమర్శలు పునరావృతమెతే తీవ్ర పరిణామాలుంటాయని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో మెడిసమ్మ రాజు,ఒడిసెల అర్జున్,ఆకుల కార్తీక్,సుంకరి సాయి,పద్మాకర్,గిల్లి విజయ్,నరేష్,కొండాజి శ్రావణ్,గంజి రాజు,గంగాధర్,లింగయ్య,రాము,ప్రసాద్,ఈర్ల విజయ్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ లో ‘‘యాంటీ డ్రగ్స్ అవగాహన’’కార్యక్రమం

### విద్యార్థులకు మాదకద్రవ్యాలపై హెచ్చరిక!



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్మల్ టౌన్ పోలీసులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నిర్మల్ గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ,విద్యార్థులు చదువుపై దృష్టి సారించి,దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,డ్రగ్స్ సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించి మృత్యువుకు దారితీస్తుందని హెచ్చరించారు.తమ ఇంటి చుట్టూ,పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఎవరైన డ్రగ్స్ సేవిస్తున్నా లేదా అమ్ముతున్నా వెంటనే 1908 నంబర్‌కు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఎవరూ కూడా డ్రగ్స్‌కు బానిస కావద్దని సూచించారు.అనంతరం గ్రామీణ ఎస్.ఐ లింబాద్రి విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని,డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు.ఇందులో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిద్ధ పద్మ ఉపాధ్యాయులు సంతోష్,రాజేందర్,చట్ల శ్రీనివాస్,సురేందర్,మోరే శ్రీనివాస్,మసియుద్దీన్,ఆశా కిరణ్,విద్యా రాణి,సునీత,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డోంకేశ్వర్ జెడ్‌పిహెచ్‌ఎస్‌లో డిఇఒ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : పదో తరగతిలో తెలుగులో 8 మంది విద్యార్థులు 100 మార్కులు సా ధించడం అభినందనీయమని డీఈఓ అశోక్ అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్, డోం కేశ్వర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా పాఠశాలకు సంబంధించి మధ్యా హ్న భోజనం పథకం ఎలా ఉందో పరిశీలించి విద్యార్థు ల నుంచి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. 10వ తరగతిలో జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. తెలుగులో సబ్జెక్టులో 100 కు 100 మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులను అభినందించారు. తెలుగులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన తెలుగు పండితులు, కవి, రచయిత సాయిలు (సాహితీ కిరీటి) ప్రత్యేకంగా శాలువతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు తెలుగులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని విద్యాశాఖాధికారి సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారితో సన్మానం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఇది తన ప్రతిభను గుర్తింపు అని సాయిలు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో తమ లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధించేందుకు పట్టుదలతో కృషి చేసి విజయం సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉత్తమ నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు చేర్పించి వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జైతాపూర్‌లో విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ పట్టణంలోని శబరి ఆస్పత్రికి చెందిన డాక్టర్లు శబరినాథ్, డాక్టర్ విజయలక్ష్మి లు బుధవారం ఎంపిపిఎస్ జైతాపూర్ పాఠశాల విద్యార్థులకు సుమారు 8వేల రూపాయల విలువైన ప్రింటెడ్ కాఫీ రైటింగ్ పుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ ను అందచేశారు. విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చడానికి, వారికి మెరుగైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడానికి ఈ సహాయం అందించబడిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శబరినాథ్ కుటుంబ సభ్యులతో పాటు జైతాపూర్ పాఠశాల ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు బాలేష్, ఉపాధ్యాయిని సుమలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో రాష్ట్ర క్రీడల ఎంపిక పోటీలు.



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడానికి బుధవారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో,స్పోర్ట్స్,అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు,జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి.ఈ ఎంపిక పోటీలలో మొత్తం 46 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.9 క్రీడా విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జూలై 1నుండి హైదరాబాద్ హకీంపేట్ లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడల కోసం ఎంపిక చేసినట్లు డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు, శ్రీకాంత్,పెటా సెక్రటరీ భోజన్న,ఎస్జిఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీడీలు,పీఈటీలు,విద్యార్థులు,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు




ప్రజాపక్షం/ఖానాపూర్ : విద్యార్థులు,యువత మత్తుకు బానిస కాకుండా సక్రమంగా చదువుకొని ఉన్నత స్థితిలో ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి,ఖానాపూర్ సిఐ అజయ్ కుమార్ అన్నారు.ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంగళవారం నిర్వహించిన ఆంటీ డ్రగ్స్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు,యువత మత్తుపదార్థులక అలవాటు పడి వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారని,క్రమశిక్షగా చదువుకొని ఉన్నత స్థితిలో స్థిరపడాలని అన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఖ్యాతం సంతోష్, బాబన్న,జాకబ్,మోహన్,రవీందర్,శ్రీనివాస్,అజయ్,మనోజ్ సత్యనారాయణ,అసిఫ్,ఉమెరా,పోలీస్‌లు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలను తీసుకోవద్దు : జీవితాన్ని జైలు పాలు చేసుకోవద్దు..



ప్రజాపక్షం/సోన్ : యువత మాదక ద్రవ్యాలకు బానిసై వారి ఉజ్వల భవిష్యత్తు కోల్పోతున్నారని సోన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి సూచలన మెరకు హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ జానర్ధన్ వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్,ఆద్వర్యంలో బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పధానోపాద్యాయులు విద్యాసాగర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత శారీరకంగా,మానసికంగా,ఆర్థికంగా నష్టపోవడంతో పాటు తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోయి,జీవితాంతం జైలులో గడపాల్సి,వస్తుందని అన్నారు. చిత్రలేఖన పోటీలలో గెలిచిన విద్యార్థులు అశ్విత, అబ్దుల్ సైఫ్,రాజేశేఖర్ లకు బహుమతులతో అటు తాను స్వయంగా 500 అందజేశారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జాదవ్ మోహన్ కానిస్టేబుల్ వెంకట రమణ,కీర్తన,సంధ్య,సూర్య భాను, రాజు,సాయరెడ్డి,లక్ష్మ ణ్,బిక్షపతి నాయక్,లింగారెడ్డి,రాజమహేందర్,ముత్తన్న,రమేష్,దత్తురాం,సౌజన్య,ప్రభ,భారతి,సంపూర్ణ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి : సిపిఐ

**ప్రజాపక్షం/మాక్లూర్ :** గ్రామశాఖ మహాసభను రాజన్న అధ్యక్షతన మాక్లూర్‌లో బుధవారం నిర్వహించగా సిపిఐ రాష్ట్ర నాయకులు భూమయ్య, జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు పాల్గొని మాట్లాడారు. సీపీఐ నిరంతరం ప్రజా, కార్మిక సమస్యల కోసం పోరాడుతున్నారని, సిపిఐ 100 సంవత్సరాల చరిత్రలో ఎంతో మంది త్యాగధనుల పోరాటాల మూలంగానే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అర్హులందరికి తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతులు పండించిన పంటకు బోనస్ తక్షణమే రైతుల ఎన్ని ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలలో సీపీఐ జిల్లా నాయకులు సాయిలు పాల్గొన్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా సాయిలు, సహాయ కార్యదర్శులుగా సాగర్, రాజలను ఎన్నుకున్నామన్నారు.

# ట్రైనీ కలెక్టర్ పర్యటన.. నర్సరీల పరిశీలన

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ట్రైనీ కలెక్టర్ కరోలినా చాంగ్ ఎన్.మావి బుధవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్, ఠాణాకలాన్ గ్రామాల్లోని నర్సరీలను, ప్లాంటేషన్లను సందర్శించి, పరిశీలించారు. ఈ పర్యటనలో ఎన్నార్ ఈజీఎస్ పథకంలో భాగంగా పెంచుతున్న నర్సరీలలోని మొక్కల పెంపకం, వాటి అభివృద్ధి, మొక్కల సంఖ్యపై ఆమె ఆరా తీశారు. ఏపీవో శ్రీవాణి ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. నర్సరీలలో మొక్కల పెరుగుదల తీరును, వాటి సంరక్షణ చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ పర్యటనతో నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకంపై స్థానిక అధికారులకు తగు సూచనలు, సలహాలు లభించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్, ప్రేందాస్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల ముప్పుపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/మోర్తాడ్:మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశ్యంతో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మోర్తాడ్ మండల కేంద్రంలో బుధవారం డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో 2కె రన్ నిర్వహించారు. అనంతరం పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. యువతలో మత్తు పదార్థాల ముప్పు గురించి అవగాహన కల్పించి, ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు పటిష్ఠంగా కొనసాగుతాయని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు మానుకోవాలి

## మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నే ప్రేమలత సురేందర్

**ప్రజాపక్షం-/భీమ్‌గల్:** తనపై అసత్య రోపణలు చేస్తు బురద జల్లడానికి బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని భీమ్‌గల్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నే ప్రేమలత సురేందర్ అన్నారు. బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో విలేఖరుల మాట్లాడారు.ఈ సందర్భగా చైర్‌పర్సన్ మాట్లాడుతు తను పదవి చెపట్టి నుండి 1కోటి 93లక్షల అవినీతి అని బిజెపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వివరాలు తెలుసుకోని మాత్రమే ఆరోపణలు చేయాలన్నారు.పదవి చెపట్టిన తరువాతనే పాత బకాయిలు సుమారు 70లక్షల బిల్లులను తను పాలక వర్గం అను మతితో మాత్రమే చెల్లించినట్లు తెలిపారు.మిగిలిన 1 కోటి 20లక్షల రూపాయలు మూడు సంవత్సరాల కాలంలో పాలకవర్గం ఆమోదం తెలిపిన తరువాతనే ఈ బిల్లులు చెల్లించినట్లు మాజీ చైర్‌పర్సన అన్నారు. మంగళవారం నాడు బిజెపి నాయకులు మాట్లాడుతు సంవత్సరంలోనే 19లక్షల బ్లీచింగ్ పౌడర్‌కు ఖర్చు అయ్యిందని ఆరోపనలు చేశారని కాని అట్టి బిల్లులో ఇదివరకే ఉన్న 7ల క్షల బిల్లులను చెల్లించి మిగిలిన 12 లక్షల బిల్లులు గడిచిన మూడు సంవత్సరాలకు సంభందించిందన్నారు.పట్టణంలో 20 బోర్లకు గాను 34 లక్షల బిల్లులకు గాను ప్రతి కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులకు 14 మందికి కలిపి తల 2 లక్షల ప్రొసీడింగ్ కాపీలను ఇచ్చినట్లు తెలిపారు.

## గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి

# స్థలం కోసం కలెక్టర్‌కు వినతి..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజీఓఎస్) నిర్మల్ జిల్లా కార్యవర్గం బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది.తమ అసోసియేషన్ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని వారు కలెక్టర్‌ను కోరారు.సీసీఎల్ఏజారీ చేసిన జీవో(గవర్నమెంట్ ఆర్డర్)మేరకు అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని టీజీఓఎస్ ప్రతినిధులు కలెక్టర్‌కు విన్నవించారు.ఈ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు టీజీఓఎస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం తెలిపింది.కలెక్టర్ కు తమ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీజీఓఎస్.అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.జి రెడ్డి,జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్,అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్



కుమార్,జాయింట్ సెక్రటరీ సుదర్శన్,పబ్లిసిటీ సెక్రటరీ విష్ణువర్ధన్,ఆఫీస్ సెక్రటరీలు రాజమల్లు,క్రాంతి కుమార్,స్పోర్ట్స్ సెక్రటరీ వినోద్ కుమార్,ఈసీ సభ్యులు శ్రీహరి,జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ఉపాధ్యాయుడు..94 మంది విద్యార్థులు..

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గణనీయంగా ఉన్న ఉపాధ్యాయుడు ఒక్కరే ఉన్నారు.రెగ్యులర్ గా ఒక ఉపాధ్యాయుడు ఒక ఉపాధ్యయురాలు ఉన్నప్పటికీ,అందులో ఉన్న ఉపాధ్యాయురాలు బెటర్నరీ సెలవుల నిమిత్తం లాంగ్ లీవ్ లో ఉన్నారు.ఈ ఉన్న ఒక ఉపాధ్యాయుడు అన్ని సజ్జెక్టులు చెప్పుతు పాఠశాల విద్యార్థులను చూసుకుంటున్నారు.విద్యార్థులు లేని చోట ఉపాధ్యాయులు ఉన్న విద్యార్థుల సంఖ్య ఉన్న చోట ఇలా ఉపాధ్యాయుల ఒకే ఉపాధ్యాయుడు ఉండడం,ఆచర్యకరం,రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను పెంచండి అని పదే పదే చెప్తూ ఇలా విద్యార్థులు పెరిగిన చోట ఉపాధ్యాయుల కొరత ఉంచడం సరైన చర్య కాదు అని గ్రామస్తులు,విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్చర్యం వ్యక్తం



చేస్తున్నారు.టీచర్లు లేని పాఠశాలలో తమ విద్యార్థులను ఉంచామని వేరే పాఠశాలలో చేర్పిస్తామని అంటున్నారు.అలా చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాల ఉనికి దెబ్బతింటుందని ఇకనైనా ఉన్నతాధికారులు,విద్యార్థులు అధికంగా ఉన్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించి తమ పిల్లల చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని పిల్లల తల్లిదండ్రులు,గ్రామస్తులు అంటున్నారు.

# ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి యుగం..

## బిజెపి నేతల విమర్శ

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** 1975 లో అప్పటి ప్రధానమంత్రి ఇంది రాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) ని దేశ చరిత్రలో ఒక చీకటి యుగంగా బీజేపీ



నేతలు అభివర్ణించారు.జూన్ 25 ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా నిర్మల్ జిల్లాలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజలు,మేధావుల సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్,స్టేట్ స్పోక్ పర్సన్ సంగప్ప పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,1975 జూన్ 25న ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు ప్రజాస్వామ్యవాదులను,ప్రతిపక్ష పార్టీల నేతలను అత్యంత క్రూరంగా వేధించారని గుర్తు చేశారు.భారతదేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని,ప్రజాస్వామ్య విలువలున్న మన దేశంలో రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం జరిగిందని వారు తీవ్రంగా విమర్శించారు.జూన్ 25 ను ఎప్పటికీ మర్చిపోలేమని,ఇది దేశ చరిత్ర లో ఒక చీకటి యుగమని పేర్కొన్నారు.ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా భారతీయ జనసంఘ్,ఆర్ఎస్ఎస్ నేతలు ముందుండి పోరాటం చేశారని,దీంతో నియంతృత్వంపై ప్రజాస్వామ్యం విజయం సాధించిందని బీజేపీ నేతలు తెలిపారు.ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి,చరిత్రను మర్చిపోయే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నా యకులు రావుల రాంనాథ్,అయ్యన్నగారి భూమ య్య, మాజీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి,జిల్లా ప్రధా న కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి,మెడిసెమ్మె రాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్,మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య,పట్టణ అధ్యక్షు డు ఆకుల కార్తీక్,స్టేట్ కౌన్సిల్ సభ్యులు దశరథ్ పోశె ట్టి,ఆదేపు సుధాకర్,మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, బరుకుంట నరేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వరం...

## ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్..



**ప్రజాపక్షం/కుంటాల :**పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ పథకం వరమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.బుధవారం మండల కేంద్రలోని రైతువేదిక లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి ,షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 32 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీచేశారు.కార్యక్రమం లో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద రావు పటేల్,తహసీల్దార్ కమల్ సింగ్,మాజీ ఎంపిపి గజ్జరాం,నాయకులు బి వి రమణ రావు,జక్కుల గజేందర్,భోగ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సు ద్వారా బోధన తరగతుల ప్రారంభం

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** మునిసిపల్ కేంద్రంలోని శ్రీ భాషిత పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఓ ప్రయివేటు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ డా.వి. బాలకిష్టా రెడ్డిచే కృత్రిమ మేధస్సు ద్వారా విద్యాబోధన తరగతుల ప్రారంభోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో బాలకిష్టారెడ్డి పదవ తరగతి విద్యార్థులతో విద్యా ప్రాముఖ్యత గురించి ముచ్చటించారు. ఇంత మంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ప్లాట్‌ఫామ్‌ను విద్యార్థులకు అందిస్తున్న శ్రీ భాషిత పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ భాగంగా పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృద్ధురాలిని పరామర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెర్కిట్ ప్రాంతానికి చెందిన బుజ్జమ్మ అనే వృద్ధురాలిని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బుజ్జమ్మను అంబులెన్స్ సిబ్బంది గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించగా ఆమెను ఆస్పత్రి వర్గాలు సరిగ్గా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో తక్షణమే స్పందించిన కలెక్టర్ వృద్ధురాలు బుజ్జమ్మకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జీజీహెచ్ ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. దీంతో బుజ్జమ్మను తిరిగి జీజీహెచ్‌కు షిఫ్ట్ చేయాలని పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుజ్జమ్మను వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

# తల్లిదండ్రులు లేరని ఆందోళన చెందవద్దు : ప్రేమలత అగర్వాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తల్లిదండ్రులు లేరని ఆందోళన చెందవద్దని బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో ఎదగాలని తెలంగాణ స్టేట్ కమీషన్ ఫ్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆకస్మిక సందర్శనలో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలసదనం, శిశు గృహ, సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి పిల్లలతో సంభా షించారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేరని ఆందోళన చెందకుండా పిల్లలు బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. అలాగే శిశు గృహాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు ప్రభుత్వం నుంచి వారికి అవసరమైన పొందాల్సిన సౌకర్యాలపై తెలియజేయాలని సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్ బి, జిల్లా బాలల రక్షణ అధికారి చైతన్యకుమార్, మండల విద్యాధికారి, స్కూల్ హెడ్ మాస్టర్ శిశు గృహ మేనేజర్ బాలసదనం సూపరింటెండెంట్ వినోద, స్వర్ణలత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌కు సన్మానం




**ప్రజాపక్షం/తాండూర్:**సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నుకోబడిన రామడుగు లక్ష్మణ్‌ను తాండూర్ మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి సమస్యలపై సిపిఐ పార్టీ గళమెత్తుతుందని, రైతు,కూలీ,కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా తీర్మాణాలు, మండల స్థాయి తీర్మాణాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి , జిల్లా సమితి సభ్యుడు సాలిగామ సంతోష్, ఎఐకేఎస్ జిల్లా కార్యదర్శి కొండు బానేష్, ఎక్స్ ఎంపిపి కామెర మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, పట్టి శంకర్, వాసాల నాగరాజు, కురిసింది తిరుపతి, దాసరి లక్ష్మి , పుట్ట భీమక్క, సముద్రాల ఆనంద్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనల స్వీకరణ

**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:** మంచిర్యాల జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్వహణ నిర్మూలించడం కోసం జాతీయ కార్యచరణ ప్రణాళిక పథకం కింద జిల్లాలో డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు కోరకు అర్హత, అనుభవం కలిగిన స్వచ్ఛం సంస్థల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం జరుగుతుంధని జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆకస్తి గల సంస్థలు ఈ అనుదన్ పోర్టల్‌లో ఈ నెల 30వ తేదీలోపు తమ వివరాలు నమోదు చేసుకొని అనంతరం ధరఖాస్తును జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

## నేడు మంచిర్యాలలో మినీ జాబ్ మేళా

### ఉపాధి కల్పన అధికారి రవికృష

**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జిల్లా కళాశాలలో ఈ నెల 26వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసి ఆఫ్ ఇండియా మంచిర్యాల శాఖలో , మంచిర్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న వంద (మహిళా కెరీర్ ఏజెంట్స్ భీమా శక్తి) పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్ఎస్‌సి పై విద్యార్హత కలిగి 18 సంవత్సరాల వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంఎస్‌సి బ్యాంకు కంపెనీ నందు తెలంగాణ వ్యాపితంగా ఖాళీ ఉన్న 60 రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ చేసేందుకు ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 26 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 991283990, 8096857078, 9110368501 నంబర్‌లను సంప్రదించాలని, ఆ సక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

## మత్తడి ఎత్తు తగ్గించకుండా మంత్రి దృష్టి

### మాజీ కౌన్సిలర్ దోమకొండ అనిల్



**ప్రజాపక్షం/ చెన్నూరు :**పట్టణంలోని శనిగకుంట మత్తడి నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రైతుల పక్షాన నిలిచి మత్తడి ఎత్తు తగ్గకుండా చూడాలని చెన్నూరు మాజీ కౌన్సిలర్ దోమకొండ అనిల్ అన్నారు. గత సంవత్సరం పలువురు స్వార్థ రాజకీయ నేతలు వారి స్వలాభం కోసం శనిగకుంట మత్తడి డిటోనటర్లతో పేల్చివేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని , అప్పట్లో మంత్రి ముఖ్య అనుచరుడైన చెన్నూరు పట్టణంలో నివాసం ఉంటున్న సిర్సా గ్రామానికి చెందిన సా ఓ అధికార పార్టీ నాయకుడు మత్తడి పేల్చివేతలో కీలకంగా వ్యవహరించి అమాయకులను జైలు పాలు చేశాడని, నేడు శనిగకుంట సమీపంలో ఉన్న తన స్థలంలోకి చేరువు నీరు చేరకుండా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని, అధికారులకు మామూళ్ల ఆశ చూపి శనగకుంట మత్తడి ఎత్తు తగ్గించేందుకు వ్యూహాలు రచిస్తున్నాడని అలా జరిగితే చెరువు ఆయకట్టును ఉన్న వందలాది ఎకరాల పంట పొలాలు బీడుబారే అవకాశం ఉన్నదని, పంట పొలాలే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు అన్యాయం జరుగుతుందని, అలాంటి అక్రమార్కుల కారణంగా పార్టీకి, మంత్రికి చెడ్డపేరు వస్తుందని, దానిని దృష్టిలో ఉంచుకొని అలాంటి అక్రమార్కులను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచి, శనిగకుంట మత్తడి నిర్మాణంలో అవకతవకలు జరగకుండా చూడాలని అనిల్ కోరారు.

## ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు



### జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్...

**ప్రజాపక్షం/మంచిర్యాల :** గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల ఔత్సాహిక మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన సమావేశ మందిరంలో ప్రపంచ బ్యాంకు నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ రైసింగ్ అండ్ యాక్సలేరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్ఫారెన్స్‌లో భాగంగా ప్రభుత్వ పరిశ్రమల శాఖ , గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల సంయుక్తంగా ఆలీఫ్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెనియర్ ఆఫ్ ఇండియా) సంస్థ సారధ్యంలో ఒక్క రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ, ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు అనంతరం 15 రోజుల పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం జరుగుతుంధని తెలిపారు. ఆచరణీయ పరిశ్రమలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్, బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందించడం జరుగుతుంధని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం ఆలీప్ సంస్థ అధ్యక్షులు రమాదేవి, ప్రాజెక్టు అధికారి ఖాసీం మహమ్మద్, ప్రాజెక్టు సమన్వయకర్త వంశీ, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి డిపిఎం ఎపిఎం జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాను సందర్శించిన కార్పొరేట్ జిఎం



**ప్రజాపక్షం/ మందమర్రి :**మందమర్రి ఏరియాను బుధవారం కార్పొరేట్ జిఎం తిరుమల రావు సందర్శించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జిఎం జి దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిఎం సిహెచ్‌పిఈ అండ్ ఎం కార్పొరేట్ తిరుమల్ రావు సైడింగ్ పనుల గురించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎస్ఒటు జిఎం విజయ ప్రసాద్, సివిల్ ఎస్ఇ రాము , సివిల్ డివైస్ ఈ శ్రీధర్, సిహెచ్‌డిజిఎం బాలాజీ, భగవతి అధికారి బాబు, సివిల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీ ఒక చీకటి దశ




**ప్రజాపక్షం/ఆదిలాబాద్‌ప్రతినిధి:**భారత చరిత్రలో ప్రధాని ఇందిరా గాంధీ హయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ చీకటి దశగా మిగిలిపోతుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు అన్నారు. సంవిదాన్ హత్య దివాస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు, అప్పటి ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కార్యక్రమ అతిథులు మాట్లాడుతూ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ ధోరణిని ప్రదర్శిస్తూ దేశంపై ఎమర్జెన్సీని విధించడం ద్వారా ప్రజాస్వామ్య ఆత్మను గొంతు నులిమి చంపేశారని పేర్కొన్నారు. తమ తప్పేమీ లేకుండా లక్షలాది మందిని జైళ్లలో పెట్టారని, మీడియా గొంతు నొక్కారని మండిపడ్డారు. అణచివేత ప్రభుత్వం చేతిలో ప్రజలు తీవ్ర హింసను ఎదుర్కొన్నారని అన్నారు. ఆనాటి నుండి కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి మారలేదని, ఇప్పటికీ అదే బాటలో ఆ పార్టీ ప్రస్థానం నడుస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

## పంచాయతీ కార్యదర్శులు,ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/వాంకిడి:**వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ వి. ప్రవీణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాం మొదలైనందున మొక్కలు నాటే కార్యక్రమం అన్ని గ్రామ పంచాయతీలలో మొదలు పెట్టాలని, మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన నీలగిరి మొక్కలు ఎస్‌పిఎం ద్వారా అందించడం జరుగుతుందని, వెదురు మొక్కలు ఫారెస్టు డిపార్ట్మెంట్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని, అలాగే పండ్ల తోటలు కావలసిన రైతులు ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటలు మంజూరు కొరకు దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి పండ్ల మొక్కల పంపిణి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపి ప్రశాణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి):**సిర్పూర్ (టి) మండలంలోని జడ్పి పాఠశాలలో బుధవారం ఎస్ఐ కమలాకర్‌తో కలిసి మండల విద్యాధికారి వేణుగోపాల్ డ్రగ్స్ మత్తు పదార్థాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ దుర్వినియోగం గురించి అవగాహన కల్పించారు. ప్రతికూల ప్రభావాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులను డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలు, సామాజిక ఆరోగ్యపరమైన పరిణామాలు, సామాజిక ఆరోగ్యపరమైన పరిణామాల గురించి ఆలోచించేలా చేస్తాయని అన్నారు. వారిలో బాధ్యతాయుతమైన ఆలోచనలు పెంపొందించడానికి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్రను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, యువత పౌరులుగా మనం డ్రగ్స్ రహిత సమాజం కోసం ఎలా కృషిచేయాలని అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సిఆర్‌పి , తదితరులు పాల్గొన్నారు.

## సిఇఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### ఎస్ఐ ప్రశాంత్

**ప్రజాపక్షం/ వాంకిడి :**సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైనా వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే సులభంగా దొరకుతాయని వాంకిడి ఎస్ఐ ఐ. ప్రశాంత్ అన్నారు. వాంకిడి మండలానికి చెందిన అహ్మద్ ఖాన్ వివోఎక్స్ 50 మొబైల్ పోవడం వల్ల వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ మొబైల్ ట్రేస్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ఈ సందర్భంగా ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మొబైల్ పోయినా లేదా దొంగిలించబడిన ప్రతీ ఒక్కరూ త్వరగా స్పందించి సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసినట్లయితే మొబైల్ ట్రేస్ అవ్వడానికి అవకాశం ఉంటుందని, ఈ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నేడు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్...

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** జాతీయ ఆరోగ్య మిషన్ విభాగం నందు యుపిహెచ్‌సిలో ఖాళీ ఉన్న రెండు పోస్టులు, ఎఎఎంలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 26 తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. యుపిహెచ్‌సిలలో రెండు ఎంఓ పోస్టులకు గాను ఎంబిబిఎస్ అర్హత గలిగి ఉండాలని , ఎఎఎంలలో రెండు ఎంఎల్‌హెచ్‌పి పోస్టులకు గాను ఎంబిబిఎస్, బిఎఎంఎస్ అర్హత కలిగి ఉండాలని ఆకస్తి అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# స్వయం సహాయక సంఘాల సభ్యురాలికి బీమా చెక్కు అందజేత

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ భీమా, ప్రమాద భీమా కింద మృతి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రుణ భీమా కింది బ్యాంకు రుణం తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్న సమయంలో అకస్మాత్తుగా మృతి చెందినట్లయితే సభ్యురాలు చెల్లించవలసిన మిగిలిన రుణాన్ని గరిష్టంగా రెండుల లక్షల వరకు స్త్రీ నిధి ద్వారా చనిపోయిన సభ్యురాలి స్వయం సహాయక ఖాతాలో జమ చేస్తుంధని, ప్రమాద బీమాకింద సభ్యురాలు నిమినిగా నమోదు చేసిన కుటుంబ సభ్యులకు పది లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో జిల్లాలోని బెల్లంపల్లి మండలంలోని ఇద్దరు సభ్యులకు సంబంధించిన సంఘ సభ్యులకు చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, స్త్రీ నిధి ఆర్ ఎం వెంకటరమణ, బెల్లంపల్లి మండల ఎపిఎం శ్యామల, సిసి రామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# బిసి జెఎసి ఆధ్వర్యంలో ఘనంగా విపి సంగ్ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** భారత మాజీ ప్రధాన మంత్రి, బిసి రిజర్వేషన్ల ప్రధాన విపి సింగ్ జన్మదిన వేడుకలను బుధవారం మంచిర్యాల ఐబి చౌరస్తాలో బిసి జెఎసి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి జెఎసి నాయకులు విపి సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిసి జెఎసి జిల్లా అధ్యక్షుడు ఒడ్డెపల్లి మనోహర్ మాట్లాడుతూ, అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి అయినప్పటికి విపి సింగ్ దేశంలో మండల్ ఉద్యమం వల్ల దేశంలో ఉన్న అట్టడుగు వర్ణాలైన బిసిలకు బిసి మండల్ 40 సిఫార్సులను అమలు చేయడం కోసం తీవ్రంగా ప్రయత్నించినట్లు గుర్తుచేసుకున్నారు. అప్పుడున్న బిజెపి పార్టీ బిసి మండల్ సిఫార్సులను తీవ్రంగా వ్యతిరేకించడం జరిగిందని అయినా కూడా విపి సింగ్ విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 27 శాతం రిజర్వేన్లు అమలు చేస్తు పార్లమెంటులో తీర్మాణం చేసి బిసిలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. బిసిలపై చిత్తశుద్ధి ఉందే ఇప్పుడు అధికారంలోని ఉన్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా బిసిలకు 50 శాతం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి జిల్లా నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, అర్కాల రాజన్న, వేముల కిరణ్, వేముల అశోక్, బిసి యువజన నాయకులు , ఎండి లతీఫ్ తదితరులు పాల్గొన్నా రు.

# ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు

### ఆదిలాబాద్ ఎస్పిఅఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్‌ప్రతినిధి;**వర్షాకాలంలో ఎటువంటి దురదృష్టకర ఘటనలు చోటు చేసుకొకుండా, ఒక వేళ ప్రమాదాలు సంభవించినా నష్టం జరగకుండా జిల్లా విపత్తు నిర్వహణ బృందం ఇరవై మంది పోలీసు సిబ్బందితో పటిష్టంగా ఉందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక సాత్నాల ప్రాజెక్టు వద్ద బుధవారం జిల్లా పోలీసు అధికారులు, విపత్తు నిర్వహణ బృందంతో కలిసి ఎస్పీ పరికరాలకు పూజలు చేశారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందంతో మాట్లాడుతూ పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాత్నాల ప్రాజెక్టులో బొటింగ్ చేసి శిక్షణ సిబ్బందికి సూచనలు చేశారు. ప్రాజెక్టులో దురదృష్టవశాత్తూ ఎవరైనా పడిపోతే వారిని రక్షించే ప్రక్రియను ప్రయోగాత్మకంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ నాటికి 355 పడకల ఆస్పత్రి భవనం పూర్తి



### రామగుండం జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలో రూ.142 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 355 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం మూడవ అంతస్తు స్లాబ్ పని పూర్తయిందని, నవంబర్ నాటికి పూర్తి స్థాయిలో భవనం పనులు పూర్తి చేసి ఆస్పత్రి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఉన్న డ్రగ్ స్టోర్, సెంట్రల్ ల్యాబ్, చిన్నపిల్లల విభాగం, ఆర్ట్ సెంటర్, చర్మ చికిత్స ఓటి, ఇతర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనరల్ ఆస్పత్రిలోని పిడియాట్రిక్ విభాగంలో నవజాత శిశు సంరక్షణ ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పిల్లల కోసం అవసరమైన వార్మర్లను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. జనరల్ ఆస్పత్రిలో డ్రగ్ స్టోర్, ల్యాబ్ వైద్య పరీక్ష రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలన్నారు. ల్యాబ్ నుంచి వైద్య పరీక్షల ఫలితాలు గంట సమయంలో వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్ స్టోర్‌లో గడువు ముగిసిన మందులు పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ సేవలు మరింత మెరుగ్గా అమలు చేయాలన్నారు. కలెక్టర్ వెంట సింగరేణి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్, ఆస్పత్రి ఆర్ఎంవో , పలువురు అధికారులు ఉన్నారు.

# తిమ్మాపూర్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం విజయం ఇ క్లబ్ బిజోన్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. వాసవి క్లబ్ రీజియన్ ఛైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ మాట్లాడుతూ, వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో సరస్వతి పథకం ద్వారా కెసిజిఎఫ్ ఫండ్ ఫిక్స్‌డ్ డబ్బులపై వచ్చిన వడ్డీ డబ్బులతో నిరుపేద విద్యార్థులకు సరస్వతి పథకం అమలు చేస్తుంధని అన్నారు. ఇందులో భాగంగానే పేద విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణి, ఐదు వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిఫ్‌లను అంధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజోన్ క్లబ్ అధ్యక్షురాలు నూక రమాదేవి, కార్యదర్శి బండ శ్రీలత, జోన్ ఛైర్మన్ మేడి లావణ్య,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో పైవేటు ఆస్పత్రుల తనిఖీ, చర్యలు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని మార్కండేయకాలనీలోని ప్రైవేటు ఆస్పత్రులను పెద్దపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.అన్నప్రసన్నకుమారి బుధవారం పరిశీలించారు. ఐ మాక్స్ విజన్ కేర్ ఆస్పత్రిలో డాక్టర్ లేనందున మూసి వేయించారు. జనని ఆస్పత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్ కె.స్రవంతి అందుబాటులో లేరని, పని చేయడంలేదని సిబ్బంది చెప్పినట్లు ఆమె తెలిపారు. ఈ ఆస్పత్రిలో పనిచేసే నర్సు, సిబ్బందికి తగిన విద్యార్హతలు లేవన్నారు. సెల్లార్‌లో ల్యాబ్, ఇన్ పేషెంట్‌లతో వార్డు నడుపుతున్నారు. ఆపరేషన్ థియేటర్, కారిడార్ ఇతర పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. నాచు పట్టి జారే లాగా ఉన్నాయన్నారు. రిజిస్టర్డ్ కన్సల్టెంట్ డాక్టర్లు కాకుండా వేరే డాక్టర్లను కన్సల్టెంట్‌గా పెట్టి నమోదు చేసుకున్న ప్రకారం బేసిక్ ఆస్పత్రి కాకుండా స్పెషాలిటి ఆస్పత్రి నడుపుతున్నార న్నారు. ఇలా నడపటం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్ నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఈ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు పరిచి నోటీసు పంపుతామన్నారు. ఆస్పత్రి యాజమాన్యం మారిన, ఏ మార్పులు చేసిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటి అనుమతి ఉండాలని లేదా నిబంధనల ఉల్లంఘన అవుతుందని అన్నప్రసన్నకుమారి తెలిపారు.

# డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు సిద్ధం

### నగరపాలక అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు పత్రాలు సిద్ధం చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్, రామగుండం నగరపాలక ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం రామగుండం నగరపాలక కార్యాలయంలో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లపై అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు, పేదలకు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేందుకు అనువైన భూములను గుర్తించి లెవలెంగ్ చేసి అందించాలని ఆదేశించారు. రామగుండంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్స్ లబ్ధిదారులకు పంపిణి చేయాలన్నారు. పేదలకు పంపిణి చేసేందుకు సిద్ధంగా ఉన్న ఇండ్ల స్థలాల పట్టాలను సిద్ధం చేయాలన్నారు. టి.యు.ఎఫ్.ఐ.డి.సి. ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి.గంగయ్య, నగరపాలక ఈఈ రామన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అమావాస్య సందర్భంగా వాసవిక్లబ్ ఆధ్వర్యంలో దానా , అన్నదానం



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్ :** మంచిర్యాల వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా గోశాలలో గోవులకు దాపిణితో పాటు ఐబి చౌరస్తాలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా దాత గుంత పుష్ప అంజయ్య కుటుంబ సభ్యుల సహకారంతో రెడ్డి కాలనీలోని లలిత గోశాలలో మూడు క్వింటాళ్ళ దానాను అందజేశారు. అనంతరం ఐబి చౌరస్తాలో నిరుపేదలు దాదాపు ఐదు వందల మందికి అన్నదానం నిర్వహించారు. అదే విధంగా దాత గంప కుమారస్వామి సహకారంతో గోదావరిరోడ్‌లోని మాతా శిశు ఆసుపత్రి నందు రోగులకు వారి బంధువులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వాసవిక్లబ్ రీజియన్ ఛైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, రీజియన్ సెక్రటరి నలుమాసు ప్రవీణ్, ప్రొగ్రాం ఛైర్మన్ పడకంటి శ్రీనివాస్, వాసవిక్లబ్ అధ్యక్షుడు కొత్త సురేందర్, కార్యదర్శి చిలువేరు మహేష్, కోశాధికారి రాచకొండ సత్యనారాయణ, సభ్యులు నకిరికొమ్ముల రాజేంద్రప్రసాద్, మల్యాల శ్రీపతి, అనంతుల సత్యనారాయణ, కాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.